

ఈ కథ జరిగిన సంవత్సరం నేను నైరుతి రైల్వేలో ఓవర్‌సీర్‌గా పనిచేస్తున్నాను. అక్కడ నాకెలా గడిచేదంటారా, యిరవైమైళ్ల దూరంలో ఒక్క యిల్లు, ఒక్క హోటలు, ఒక్క పురుగు లేదు.

అప్పటికి మంచి యవ్వనంలో వున్నాను. ఎలాంటి కష్టాన్నైనా ఎదుర్కోవాలనే ఉత్సాహం వుండేది. నాకున్న ఒకే ఒక కాలక్షేపమూ. వచ్చీ పొయ్యే రైళ్ల కిటికీలలో ప్రయాణీకుల మొహాల్ని చూడటమే. లేదా బోరు కొట్టినప్పుడు కల్తీ వోడ్కా (మంచిది దొరకదు మరి) తాగటం. రైల్లో క్షణం కనిపించి మాయమయ్యే ఆడవాళ్ల మొహాలు చూసి కలలు కనడం, స్పృహ కోల్పోయిందాకా మళ్లీ తాగటం... రోజులూ, వారాలూ, నెలలూ అలాగే గడిచిపోయేవి. ఉత్తరాన పచ్చిక మైదానాల్లో పుట్టి పెరిగిన నాకు, ఈ దక్షిణ ప్రాంతం ఎడారి లాగుండేది. వేసవి రాత్రుల్లో, వడగాలి వీస్తున్నప్పుడు, చంద్రుడి మసక వెలుగులో, మిడతలు ముసురుకుంటూంటే ఎంత దిగులుగా వుండేదో! ఇంక చలికాలం చుట్టూ పరచుకున్న మంచుటెడారి, శీతగాడ్పులు, తోడేళ్ల కూతలు. ఆ ప్రకృతి భీభత్సంలో బందీని నేను.

ఆ స్టేషన్‌లో వుండేది ముగ్గురం. నేను, నా భార్యా, ఓ చెవిటి టెలిగ్రాఫ్ ఆపరేటర్. మరో ముగ్గురు వాచ్‌మెన్, నాకో అసిస్టెంటుండేవాడు. కాని వాడికి క్షయ. ట్రీట్‌మెంటు వంకతో ఎప్పుడూ సెలవుమీదే వుండేవాడు. అలాగ వాడి పని కూడా నామీదే పడేది.


మాకు పిల్లల్లేరు. మా యింటికెవరూ రారు. మేమెక్కడికీ పోము. ఎప్పుడైనా నెలకొకసారి [illegible] పక్కస్టేషన్లో వున్న [illegible] కొలీగ్స్‌ని కలిసి వచ్చేవాణ్ణి. మొత్తం మీద, ఆ రోజుల్లో నా బతుకు ఎంత డల్‌గా వుండేదో అర్థమైంది గద.

ఒకసారి, కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించడానికి సిద్ధమవుతున్నాం. మా ఆవిడేదో పనిచేస్తున్నది. నేను టేబుల్ దగ్గర కూర్చుని, పక్కగదిలో టెలిగ్రాఫ్ ఆపరేటర్ చేస్తున్న గోలను భరిస్తున్నాను. అప్పటికే అయిదు గ్లాసుల (కల్తీ) వోడ్కా లాగించి నిద్రో, వేకువో తెలియని స్థితిలో ఉన్నాను. బెంగగా వుంది. ఈ బతుక్కింక మోక్షం లేదా! ఈ స్టేషను దగ్గిర, అడవిలో, ఈ ఎడారిలో యిక్కడే రిటరై పోతానా? నిమిష నిమిషానికీ మూతబడుతున్న నా కళ్లను మా ఆవిడ పరీక్షగా చూస్తున్నది. నేనంటే మా ఆవిడకు చాలా యిష్టం. ఎంత యిష్టమంటే, నా నేరాల్ని, పాపాల్ని, కోపాల్ని, దుర్గుణాలను కూడా సుగుణాలుగా చూడగలదు. అంత మంచి పెళ్లాం దొరికితే సాధించకుండా వుండబుద్ధవుతుందా! చీటికి మాటికీ

**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

నా కోపం, విసుగంతా ఆవిడ మీద తీసేవాణ్ణి. డల్‌గా వుందని పండగలూ, పబ్బాలూ మానెయ్యం కదా! కొత్త సంవత్సరం హడావిడి ప్రారంభించాం. రాత్రి పన్నెండు కాగానే ఆహ్వానం పలకాలి. రెండు మంచి షాంపేను బాటిల్సు రెడీగా వున్నాయి. టీచర్ పాఠంతో విసుగెత్తిన పిల్లలు క్లాసురూం లోకి సీతాకోకచిలకో, తుమ్మెదో వస్తే దాన్నే చూస్తూ కూర్చుంటారు. అలాగ నేను చలనం లేని నా జీవితంలోకి ప్రవేశించిన షాంపేను బాటిల్సును చూస్తూ కూర్చున్నాను. కళ్లు గడియారం ముల్లు మీదున్నాయి.

పన్నెండింటికి మరో అయిదు నిమిషాలున్నది. బాటిల్సు తీసి పైన పెట్టాను. ఓపెనర్ సిద్ధం చేశాను. అప్పటికే తాగిన (కల్తీ) వోడ్కా ప్రభావమో, ఆత్రుతో తెలియదు గాని 'ఠప్' మని కార్కు లాగగానే బాటిల్ జారింది. కింద పడలేదు. కాసింత షాంపేను ఒలికింది.



"హాపీ న్యూ యియర్. కమాన్. బాటమ్స్ అప్"
మా ఆవిడ మొహం వివర్ణమైంది.

"బాటిల్ జారిందా?"

"ఆఁ. అయితే ఏమిటి?"

"అది దుశ్శకునం. ఈ సంవత్సరం ఏదో కీడు జరుగుతుంది."

"నీ మూఢ నమ్మకాలూ నువ్వూ. తాగవే. హాపీ న్యూ యియర్."

"భగవంతుడు రక్షించాలనే ప్రార్థిస్తున్నాను. కాని శకునం వూరికే పోతుందా? ఓపిక పట్టు. నీకే తెలుస్తుంది."

నేనెన్ని సార్లడిగా ఆమె ఒక్క చుక్క షాంపేన్ కూడా ముట్టలేదు. మొహం మాడ్చుకుని, కిటికీ దగ్గరకెళ్లి నిల్చుంది. ఆవిణ్ణి కాసేపు తిట్టి, సగం బాటిల్ ఖాళీచేసి చల్లగాలిలో అరగటానికి బయటికొచ్చాను.

మంచు కురుస్తున్నది. చంద్రవంకా, రెండు మబ్బులూ ఆకాశంలో నిశ్చలంగా వున్నాయి. అలికిడి లేదు. కదలిక లేదు.

మా ఆవిడ మంచిదే కాని మూర్ఖురాలు. నేను శకునాలను నమ్మనని కాదు. ఇప్పుడు మేమున్న పరిస్థితిలో యింతకన్నా కీడేం జరగగలదు?

పట్టుకుని, ముక్కలుచేసి, రోస్టు చేసుకుని తిన్న తరువాత చాపకు యింకా ఏమన్నా కీడు జరిగే అవకాశముంటుందా?

కాల్చి పారేసిన సిగరెట్ పీక లాగైంది నా బతుకు. చిన్నప్పుడే మా నాన్న చనిపోయాడు. ఒకప్పుడు బాగా వున్న వాళ్లమే అయినా నా వంతు వచ్చేసరికి చిప్ప మిగిలింది. ఫీజు కట్టడానికి డబ్బుల్లేక స్కూలుక్కూడా సరిగ్గా వెళ్లలేదు. బంధువులు కూడా ఎవ్వరూ సాయం చెయ్యలేదు. నా చదువుకు ఈ ఉద్యోగం దొరకటమే గగనమైంది. పుట్టినప్పటి నించి యిప్పటిదాకా కష్టాల కాలవలో ఈదుతూనే వున్నాను. ఇంకా ఏదో చెడు జరుగుతుందట. నా బొంద.

దూరంగా రైలు చప్పుడైంది. రెడ్ లైటు వెలిగింది. టెలిగ్రాఫ్ తీగలు కదులుతున్నాయి. కీడంటే ఏమిటి? నా భార్యకేదన్నా అవుతుందా? ఏమనుకోవద్దు, మీతో చెబుతున్నాను. నాకు మా ఆవిడంటే అంత యిష్టమేమీ లేదు. చిన్నప్పుడే మా పెళ్లైంది. నేనింకా అందంగానే వున్నాను. దానికప్పుడే తల నెరిసింది. మొహం ముడతలు పడింది. జబ్బుకళ్లు. ఆ మట్టి బుర్ర నిండా మూఢ నమ్మకాలు. తప్పుగా అనుకోకండి. ఆవిడంటే అయిష్టమని చెప్పలేదు. పెద్దగా ఇష్టం లేదు అని మాత్రమే అన్నాను. అయితే యింతకూ ఏమిటా జరగబోయే కీడు? నా జీవితం యిలాగే నిరర్థకంగా గడిచిపోతుంది. యవ్వనం గడిచి మధ్యవయసూ, వృద్ధాప్యమూ వచ్చేస్తాయి. నేలపైనున్న సమాధి జీవితం నుంచి నేలలోని సమాధికి చేరుకుంటాను.

రైలు స్టేషన్లో ఒక నిమిషం ఆగి మళ్లీ బయల్దేరింది. కొన్నిసార్లు మనం కష్టాలను కూడా ప్రేమిస్తాం. ఇప్పుడు నా పరిస్థితి అలాగే వుంది. ఇంకా జరగాల్సిన ఏ కీడు బాకీ వుంది?

ఆరోగ్యం సరిగా వుండదు. డబ్బులేదు. పై అధికారులు ఎప్పుడూ నాకు అక్షింతలు వేస్తూనే వుంటారు. అర్థాకలికి ఏదో తింటాను గాని భూక్తాయాసం అనేది తెలియదు. పైవాళ్లు నన్ను తిడితే నేను మా ఆవిణ్ణి తిడతాను. నేను చెయ్యిందేమిటి? హత్యా, దొంగతనం. బహుశా అంత ధైర్యం, సాహసం నాకు తెలీవు.

అలా, తిరిగి తిరిగి యిల్లు చేరేసరికి, మా ఆవిడ నవ్వుతూ ఎదురొచ్చి

"మీకో వార్త చెప్పాలి. గదిలోకెళ్లి మంచి చొక్కా వేసుకుని రండి. మనింటికో గెస్టు వచ్చారు."

"గెస్టా?"

"ఆఁ. నటాషా ఆంటీ యిప్పుడే రైలు దిగింది."

"నటాషా ఆంటీ ఎవరు?"

"అంకుల్ సెమ్యోన్ లేడూ? వాళ్లావిడ. మీకు తెలియదులే. ఉత్తమ యిల్లాలు"

నా మొహంలో రంగులు మారటం చూసిందనుకుంటాను. మాట మార్చి

"అలా చిరాకుపడకు. మీకేమీ యిబ్బంది లేకుండా చూస్తాన్లే. అంకుల్ సెమ్యోన్ చండశాసనుడు. ఒక్క మూడు రోజులుండి వెళ్లిపోతుంది. ఆవిడ తమ్ముడొచ్చి తీసికెడతాడు."

మా ఆవిడ వాళ్ల అంకుల్ క్రూ రత్వాన్నీ, (అసలు మగాళ్లంతా క్రూరులనే అర్థంలో కొంత) భార్యల కష్టాల్నీ (తనూ, తన ఆంటీ), కష్టాల్లో వున్న వాళ్లను (ఆంటీని) ఆదుకోవటం గురించీ ఏకరువుపెట్టి నా కళ్లు తెరిపించ ప్రయత్నించింది.

ఆవిడ వుపన్యాసం భరించడం కన్నా, ఆంటీని భరించడం సులభం అనుకొని పక్కగదిలో కెళ్లాను.

టేబుల్ దగ్గిర సన్నగా, సుకుమారంగా వున్న యువతి. పెద్ద కళ్లు. భుజాల మీదికి జారిన పట్టులాంటి జుట్టు. ఆమె వునికి గదిని కాంతివంతం చేసింది. సెంటువాసన దగ్గిరగా రమ్మంటున్నది. ఆ గొంతులోని మార్దవం మాటలు మళ్లీ మళ్లీ వినాలనిపిస్తున్నది. భర్తనించి పారిపోయి వచ్చింది. అతడు చండశాసనుడో కాదో గాని వృద్ధుడు. ఈమె నవయువ్వని. సరదాగా నవ్వుతూ తుళ్లుతూ గడపాలనుకుంటున్న సుందరి. ఆ నడక, ఆ వూపు ఆమె స్వభావాన్ని దాచలేక పోయాయి.

"ఆహా, యింత మంచి మేనల్లుడున్నాడని నాకు తెలియదే!" అన్నది నటాషా ఆంటీ సిగ్గు నటిస్తూ కుడిచెయ్యి మొహానికి అడ్డుపెట్టుకుని.

"ఇంతందమైన ఆంటీ వుందని నాకూ తెలియదు" నేను.

భోజనాని క్కూర్చున్నాం. రెండో షాంపేన్ బాటిల్ ఓపెన్ చేశాడు. ఆంటీ తన గ్లాసు ఒక్క గుక్కలో ఖాళీ చేసింది. మా ఆవిడ ఏదో పనిమీద వంటింట్లో కెళ్లిన రెండు నిమిషాల్లో రెండో గ్లాసు ఖాళీ చేసింది. వైనెక్కువై మత్తుగా వున్నది... ఆంటీ సమక్షంలో...

వల్లటి ఆ విశాల నేత్రాలు.
నన్ను కాల్చేస్తున్నాయి
భరించ లేను
భరించలేను

ఆ తర్వాత ఏమైందో నాకు తెలియదు. ప్రేమను గురించి తెలుసుకోదలచిన వాళ్లు కథలూ, నవలలూ చదువుకోండి. నాకు తెలిసింది పాటలోని ఆ చరణం ఒక్కటే.

దుశ్శకునం, దుర్దినం అంటే
నువ్వు నాకు కనిపించిన క్షణమే

ఎన్ని ఉత్పాతాలు. ఎన్ని అగ్నిశిఖలు. సుడిగాలిలో ఎండుటాకులా మారింది జీవితం. వెనుతిరిగి చూసుకోగలిగిన నాటికి నా భార్యలేదు. ఆంటీ లేదు. ఒంట్లో సత్తువా లేదు. ఎడారిలోనుండి నరక గహ్వరంలోకి చేరుకున్నాను. ఇప్పుడు చెప్పండి. ఇంతకన్నా యింకేం జరగగలదని మళ్లీ అంటారా? ■

టేబుల్ దగ్గిర సన్నగా, సుకుమారంగా వున్న యువతి. పెద్ద కళ్లు. భుజాల మీదికి జారిన పట్టులాంటి జుట్టు. ఆమె వునికి గదిని కాంతివంతం చేసింది. సెంటువాసన దగ్గిరగా రమ్మంటున్నది. ఆ గొంతులోని మార్దవం మాటలు మళ్లీ మళ్లీ వినాలనిపిస్తున్నది. భర్తనించి పారిపోయి వచ్చింది.